క్లుప్తంగా

భార్యపై భర్త దాడి

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన శశికళపై ఈమె భర్త నరేష్ సోమవారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. వివరాలు.. ఆర్‌ఎస్‌లోని గౌతమేశ్వరాలయం సమీపంలో శశికళ, నరేష్ దంపతులు నివాసం ఉంటున్నారు. గత కొన్ని రోజుల క్రితం మనస్పర్థల కారణంగా ఇద్దరూ విడిపోయారు. ఈ క్రమంలో గుత్తిలోని ఓ చర్చి వద్ద ఉన్న శశికళపై భర్త నరేష్ అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన శశికళను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11:30 గంటలకు జరుగుతుందని కమిషనర్ మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ

గుంతకల్లు రూరల్: పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఏఓ స్వాతి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భీమలింగేశ్వర, అన్నదాత, స్వర్ణ తదితర ఫర్టిలైజర్స్, ఎరువులు దుకాణాలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని షాపుల యజమానులను హెచ్చరించారు. మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు.

రోడ్డు,కల్వర్టు పనుల పరిశీలన



సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద సాధారణ మున్సిపల్ నిధులతో నిర్మిస్తున్న కల్వర్టు, అంజుమన్ స్ట్రీట్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత వ్యవధిలోగా పనులు పూర్తి చేయించాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. టీపీఎస్ అబ్దుల్‌సత్తార్, డీఈ రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

శింగనమల: మండలంలోని ఇరువెందల, రాచేపల్లి, నిదనవాడ, ఆనందరావుపేట గ్రామాల్లో మంగళవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు జ్యోతిరావు పూలే జయంతి

బుక్కరాయసముద్రం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ అంకే నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు.

108 వాహనంలో ప్రసవం



బిడ్డను అందిస్తున్న 108 సిబ్బంది

గుంతకల్లు: విడపనకల్లు మండలం కడదరబెంచ్‌కు చెందిన పద్మ 108 వాహనంలో ప్రసవించింది. కడదరబెంచ్‌కు చెందిన పద్మకు ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108 వాహనంలో గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా, పెంచలపాడు గ్రామ సమీపంలో నొప్పులు అధికమయ్యాయి. అంబులెన్స్ డ్రైవర్ నాగరాజు, ఈఎంటీ అనిల్‌కుమార్ 108వాహనంలో గర్భిణి కుటుంబ సభ్యుల సహకారంతో కాన్పు చేయించారు. ఆమెకు ఆడబిడ్డ జన్మించింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడిపత్రి: మండల పరిధిలోని చుక్కలూరు గ్రామ సమీపంలోని గంగమ్మ గుడి వద్ద తాడిపత్రి – గుత్తి ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన విశ్వనాథ్ (28) మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ వివరాల మేరకు... తాడిపత్రికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంపై చుక్కలూరు బయలుదేరిన విశ్వనాథ్‌ను గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో విశ్వనాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పెద్దక్క , బాబు (3), పాప (1) ఉన్నారు.

హర హర మహాదేవ

- వైభవంగా కార్తీక పౌర్ణమి
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



తాడిపత్రి: బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

తాడిపత్రిటౌన్: హర హర మహాదేవ శంభో శంకర అన్న నామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తాడిపత్రి పట్టణంలోని పురాతన ఆలయం బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్ద ఎత్తున మహిళా భక్తులు ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు.

కార్తీక పౌర్ణమి వేడుకలు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో సోమవారం కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తులు పూజలు చేశారు. అలాగే మహిళలు ఆలయాలు వద్ద భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా లక్షదీపారాధన

పామిడి: పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రమైన భోగేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్ భోగేశ్వరుడిని సుందరంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం లక్షదీపారాధన జ్వాలాతోరణ మహోత్సవం నిర్వహించారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శివాలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. కార్తీక సోమవారం సందర్భంగా రెడ్డి స్ట్రీట్, పాతగుంతకల్లులోని రామలింగేశ్వరస్వామి, చంద్రశేఖర్ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ పరిసరాలు శివ నామస్మరణతో మార్మోగాయి.

ఎమ్మెల్యే నివాసంలో ప్రత్యేక పూజలు : ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి నివాసంలో కార్తీపౌర్ణమిని పురస్కరించుకొని సత్యనారాయణస్వామి వ్రతాన్ని వేద పండితులు నిర్వహించారు. ఎమ్మెల్యే వైవీఆర్ దంపతులతో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన కార్తీక వనభోజనాలకు పట్టణంలోని రాజకీయ ప్రముఖులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



గుత్తి: నగరేశ్వరాలయంలో ఓం ఆకారంలో వెలిగించిన కార్తీక దీపాలు

శోభాయమానం.. కార్తీక దీపోత్సవం

గుంతకల్లు రూరల్: ప్రసిద్ధ శైవ క్షేత్రం బుగ్గ సంగమేశ్వర ఆలయం కార్తీక దీపకాంతులతో శోభాయమానంగా విరాజిల్లింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. మహాశివుడి నామస్మరణతో ఆలయ పురవీధులు మార్మోగాయి. సోమవారం ఉదయం 4 గంటల నుంచే ఆలయానికి పోటెత్తిన భక్తులు ఆలయ పుష్కరిణి వద్ద పవిత్ర స్నానాలు ఆచరించి, స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బుక్కరాయసముద్రం/నార్పల/శింగనమల: బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద వెలసిన కాశీ విశ్వేశ్వర దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా 44వ అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 3:30 గంటలకు గణపతి పూజ, 3:30 నుంచి 4:30 గంటల వరకూ కలశ పూజ చేశారు. 4 నుంచి 5 గంటల వరకూ సర్వాభిషేకం 6:30 నుంచి 7:30 గంటల వరకూ మహా అన్నాభిషేకం, 8 గంటలకు మహా మంగళ హారతి, 8:30 నుంచి భక్తులకు అన్నాభిషేక దర్శనం కల్పించారు. అలాగే నార్పలలో రాఘవేంద్ర స్వామి ప్రత్యేక పూజలు చేశారు. శింగనమల మండలం చిన్నజలాలపురంలోని దొణరామేశ్వరాలయంలో 101 బిందెలతో అభిషేకం చేశారు.

పెద్దవడుగూరు: మండలంలోని చింతలచెరువు, పెద్దవడుగూరు, చిత్రచేడు, చిన్నవడుగూరు తదితర గ్రామాల్లో సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి దీపాలను వెలిగించారు.



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యే వైవీఆర్, కుటుంబ సభ్యులు

ఘనంగా సత్యనారాయణ వ్రతం

యాడికి: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. 21 జంటలకు అర్చకులు వ్రతాన్ని చేయించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు, వాసవీ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తొండపాడులో లక్ష దీపోత్సవం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడులో వెలసిన శివాలయం, నారమ్మ సత్రంలో సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహించారు. ముందుగా బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని రంగనాథుడికి కుంభాభిషేకం, గంగాజలాభిషేకాలు చేశారు. సాయంత్రం శివాలయంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, ఊంజల్ సేవ, జ్వాలాతోరణం, ఆకాశ దీపం, ఉసిరి చెట్టుకు పూజలు, గోపూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్, ఈఓ దేవదాసు, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలు మోహన్ పాల్గొన్నారు.

గుత్తిలో..

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్‌ఎస్ పట్టణాల్లో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. గుత్తిలోని నగరేశ్వరాలయం, కాశీ విశ్వేశ్వరాలయం, నాగలింగేశ్వరాలయం , ఆర్‌ఎస్‌లోని గౌతమేశ్వరాలయం, అప్పయ్య దేవాలయాల్లో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు.



పామిడిలో అలంకరణలో భోగేశ్వరుడు

రామలింగేశ్వరస్వామి సేవలో మంత్రి పెద్దిరెడ్డి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామాజిక బస్సుయాత్రకు వచ్చిన ఆయనకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి పేరం స్వర్ణలత తాడిపత్రి సరిహద్దు గ్రామమైన బొందలదిన్నె గ్రామం వద్ద స్వాగతం పలికారు. కార్తీక సోమవారం కావడంతో మంత్రి పెద్దిరెడ్డి బుగ్గ రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో అహుడా చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్, ఆలయ ఈఓ సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న భోగేశ్వరాలయం



పాతగుంతకల్లు శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



గుంతకల్లు: దీపాలను వెలిగిస్తున్న భక్తులు



పెద్దవడుగూరు: శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



తాడిపత్రి: ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ







బుక్కరాయసముద్రం: భక్తులతో కిటకిటలాడుతున్న కాశీ విశ్వేశ్వర ఆలయం



గుంతకల్లు: బుగ్గ సంగమేశ్వర దేవాలయంలో...

ఘనంగా గనుల భద్రత వారోత్సవాలు

యాడికి: మండలంలోని గుడిపాడు వద్ద సాగర్ సిమెంట్ కర్మాగారం సమీపంలో 38వ గనుల భద్రత వారోత్సవాలను సాగర్ సిమెంట్ కర్మాగారం యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎంఎస్ రఘుపతి పెద్దిరెడ్డి, డీడీఎంఎస్ అప్పలనాయుడు, సాగర్ సిమెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ గణేష్ హాజరయ్యారు. గనుల భద్రతా వారోత్సవాల్లో రాయలసీమ జోనల్ స్థాయిలోని 25 గనుల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సాగర్ సిమెంట్ కర్మాగారంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యకలాపాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆయా సిమెంట్ కర్మాగారాల్లో విధులు నిర్వహిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి ముఖ్య అతిథులు అవార్డులతో పాటు మెమొంటోలను అందించారు. కార్యక్రమంలో సాగర్ సిమెంట్ వైస్ ప్రెసిడెంట్ పాండు రంగారెడ్డి, మైనింగ్ హెచ్‌ఓడీ సురేష్‌రెడ్డి, హెచ్ ఆర్ నాగేశ్వర రావు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న సాగర్ సిమెంట్ వైస్ ప్రెసిడెంట్ పాండు రంగారెడ్డి

జవాన్‌కు తీవ్ర గాయాలు

గుంతకల్లు రూరల్: మండలంలోని దోసలుడికి - గుండాల తండా మధ్య సోమవారం ఉదయం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గుండాల తండా నివాసి, సీఆర్‌పీఎఫ్ జవాన్ రేఖానాయక్ తీవ్రంగా గాయపడ్డారు. జమ్ముకాశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆయన కొన్ని రోజుల క్రితం సెలవుపై స్వగ్రామానికి వచ్చారు. సోమవారం గుంతకల్లులో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన రోడ్డుకు అడ్డంగా పరుగున వచ్చిన పంది ఢీకొనడంతో వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన రేఖానాయక్‌ను అటుగా వెళుతున్న వారు గమనించి గుంతకల్లులోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా

శింగనమల: ఈనెల 23 నుంచి 25 వరకూ కర్నూలులో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఇమ్రాన్ అలీ సత్తా చాటాడని హెచ్ఎం సుజాతమ్మ, పీడీ నందకుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దపప్పూరు: మండలంలోని తిమ్మనచెరువు గ్రామానికి చెందిన శంకర్ (24) అనే యువకుడు ఆదివారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. అయితే అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శంకర్ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాడు - నేడుపై శిక్షణ కార్యక్రమం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వైఎస్సార్ కళ్యాణ మండపంలో సోమవారం మన అంగన్‌వాడీ నాడు - నేడు కార్యక్రమంపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు, కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి, నోడల్ అధికారి వనజాక్షి హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం , పౌష్టికాహారం, ప్రజల భాగస్వామ్యంతో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, సీడీపీఓ సాజదాబేగం తదితరులు పాల్గొన్నారు.

రికవరీ సొత్తు బాధితులకు అందజేత



బంగారు నెక్లెస్‌ను అందిస్తున్న సీఐ వెంకటరామిరెడ్డి

గుత్తి: పోగొట్టుకున్న సొత్తును సీఐ వెంకటరామి రెడ్డి రికవరీ చేసి సోమవారం బాధితులకు అందించారు. మండలంలోని యంగన్నపల్లికి చెందిన వెంకటనాయుడు 15 రోజుల క్రితం తన భార్యతో కలిసి గుత్తిలోని ఓ ఫంక్షన్‌కు వెళ్తుండగా, మార్గంమధ్యలో బంగారు గొలుసు పోగొట్టుకున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రికవరీ చేసిన గొలుసును బాధితులకు సీఐ వెంకటరామిరెడ్డి అందజేశారు.

మూడిళ్లలో చోరీ

గుంతకల్లు టౌన్: తాళం వేసిన మూడు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దుండగులు విలువైన నగలు, నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న వీధిలో నివాసముంటున్న శ్రీదేవి.. ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి కార్తీక పౌర్ణమి వేడుకను పాత గుంతకల్లులోని తన పుట్టింట జరుపుకునేందుకు వెళ్లారు. ఈ విషయాన్ని పసిగట్టిన దుండగులు ఇంటి తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాలో భద్రపరిచిన బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు అపహరించుకెళ్లారు. అలాగే అదే వీధిలో నివాసముంటున్న ఉమామహేశ్వరగౌడ్ ఇంట్లో చొరబడి బంగారు నగలు, రూ.20 వేలు అపహరించుకెళ్లారు. కాగా, ఉమామహేశ్వర గౌడ్ కాశీ యాత్రకు వెళ్లినట్లు సమాచారం. అదే వీధిలోని ఇండియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న బాలాజీ పిక్చర్స్ అధినేత శ్రీనివాసులు ఇంటికి తాళం వేసి వైద్యపరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు బీరువాలోని బంగారు నగలు, వెండి సామగ్రి అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్‌ఐ థామస్ డెన్నీ తెలిపారు.

గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్ర సభలు

పామిడి: మండలంలోని కట్టకిందపల్లి, దిబ్బసానిపల్లి పంచాయతీ గ్రామాల్లో సోమవారం పీఎం వికసిత భారత్ సంకల్పయాత్ర సభలు నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు చేకూరుస్తున్న లబ్ధికి సంబంధించిన 17 రకాల పథకాలపై అధికారులు వివరించారు. ఆయా గ్రామాల సర్పంచులు కదిరమ్మ, బాలనాగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ బీవీ శశికళ, ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్‌రాజు, లక్ష్మణ్, పుల్లయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇల్లూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

గార్లదిన్నె: మండల పరిధిలోని ఇల్లూరులో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ భాస్కర్ తెలిపారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల అమలు, లబ్ధి వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరిస్తామన్నారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

రేపు వాహనాల వేలం

తాడిపత్రి: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు రకాల ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 29న వేలం వేస్తున్నట్లు తాడిపత్రి రూరల్ ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వేలం ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు 10 శాతం ధరావత్తు చెల్లించి ఆధార్‌కార్డు తీసుకొని రావాలని సూచించారు.

స్థలం కేటాయించండి

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామస్తులు శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని తహసీల్దార్ మహబూబ్‌బాషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు రంగనాయకులు, జానకీరాముడు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటికకు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ శ్మశానాన్ని పరిశీలించి, భూమి సర్వే చేయాలని వీఆర్‌ఓకు ఆదేశించారు.

మాజీ ఎమ్మెల్యే జగదీష్‌కు ప్రముఖుల సంతాపం



జగదీష్ భార్య ప్రమీల, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్



అంజలి ఘటిస్తున్న అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



పుష్పగుచ్ఛం వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

గుంతకల్లు: గుత్తి మాజీ ఎమ్మెల్యే ఆరికేరి జగదీష్ గొప్ప రాజకీయ నాయకుడిని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ విప్ వై.శివరామిరెడ్డి కొనియాడరు. పలువురు ప్రముఖులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఎస్.రామలింగప్ప, జింకల రామాంజనేయులు, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజనేయులు, పలువురు కౌన్సిలర్లు తదితరులు ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజలు కూడా తరలివచ్చి జగదీష్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.